క్లుప్తంగా

ఆర్‌సీఈ విద్యార్థులకు ర్యాంకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు జవహర్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ కాకినాడ స్థాయిలో టాపర్లుగా నిలిచారని ఆ కళాశాల చైర్మన్ కె.వేణుగోపాల్ తెలిపారు. 2020–24 బ్యాచ్‌కు సంబంధించి సీఎస్‌ఈ బ్రాంచ్‌లో తమ విద్యార్థిని జయంతి విశాల సుబ్బలక్ష్మి 9.08 సీజీపీఏతో జేఎన్‌టీయూకే అనుబంధ కళాశాలల్లో ప్రథమ, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్ బ్రాంచ్‌లో పి.ఆదిత్య 8.01 సీజీపీఏతో ప్రథమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. వీరు త్వరలో జేఎన్‌టీయూకే నుంచి బంగారు పతకాలతో పాటు నగదు బహుమతులు అందుకుంటారని తెలిపారు. కళాశాల కార్యదర్శి కె.సాయి రోహిత్, ప్రిన్సిపాల్ ఎం మురళీధరరావు మాట్లాడారు.

నిరంతర సాధన అవసరం



పుస్తకపఠనం చేస్తున్న విద్యార్థులు

దెందులూరు: విద్యార్థులకు నిరంతర సాధన, ఆసక్తి అవసరమని పోతునూరు గ్రంథ పాలకుడు రాంబాబు అన్నారు. శనివారం పాఠశాల విద్యార్థులలో నీతి కథలు చెప్పించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు క్రమం తప్పకుండా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గ్రంథాలయాలకు వచ్చి వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులను రాంబాబు అభినందించారు.

010 పద్దు ట్రెజరీ ద్వారా జీతాలు ఇవ్వాలి

దెందులూరు: పంచాయతీ కార్మికులకు 010 పద్దు, ట్రెజరీ ద్వారా కనీస వేతనాలు అమలు చేయాలని ఏపీ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి పీ.కిషోర్, జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబులు డిమాండ్ చేశారు. శనివారం ఉదయం ఏలూరు రూరల్ మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్మికులు ఏఐటీయూసీ సంఘంలో చేరిన సందర్భంగా చాటపర్రులో పంచాయతీ కార్మికుల సమావేశం జరిగింది. పి.కిషోర్, పుప్పాల కన్నబాబులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు నెల నెలా జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు, వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు సకాలంలో యూనిఫారం, సబ్బు లు, చెప్పులు, కొబ్బరినూనె, రక్షణ కు చేతి గ్లౌజులు అందించాలని కోరారు. సమవేశంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో వైద్య రంగం కుదేలు

- ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలపై నీలినీడలు
- యూపీహెచ్‌సీల్లోనూ సేవలు అంతంతమాత్రమే
- జీజీహెచ్‌లో పేదలకు అందని వైద్యం

ఏలూరు టౌన్: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలో వైద్య రంగం కుదేలైంది. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్య సేవలు అందే పరిస్థితి లేకపోవటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రైవేటు హాస్పిటల్స్‌కు చెల్లించాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు పేదలకు దూరమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అత్యుత్తమ స్థాయి వైద్య చికిత్సలు, సేవలు అందిస్తూ భరోసాగా నిలిస్తే.. నేడు కూటమి పాలనలో సరైన వైద్యం అందని దుస్థితి నెలకొంది.

జీజీహెచ్‌లో అందని వైద్యం

ఏలూరు సర్వజన ఆసుపత్రికి ప్రతి రోజూ జిల్లా వ్యాప్తంగా 900 నుంచి 1200 మందికి పైగా ప్రజలు ఓపీ, అత్యవసర వైద్య సేవలకు వస్తుంటారు. ఈ ఆసుపత్రిలో రోగులను తీసుకువెళ్లేందుకు అవసరమైన స్ట్రెచర్లు, వీల్‌చైర్లు సైతం అందుబాటులో లేవు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో సహాయకులే నడవలేని స్థితిలోని రోగులను వీల్ చైర్లలో ఉంచి తోసుకుంటూ తీసుకువెళ్లాల్సి వస్తోంది. గుండె వైద్య నిపుణులు, న్యూరో సర్జన్, అత్యవసర సేవల వైద్య నిపుణులు లేకపోవటంతో ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేకుండా పోయిందనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. జీజీహెచ్‌లో 78 మంది వైద్య నిపుణుల పోస్టులకు సుమారు 26 మంది వైద్యుల పోస్టులు నేటికీ భర్తీ కాకపోవటంతో ప్రజల కష్టాలు వర్ణనాతీతం.

నత్తనడకన కాలేజీ భవన నిర్మాణం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.525 కోట్లు నిధులు మంజూరయ్యాయి. జీజీహెచ్ ప్రాంగణంలో సుమారు 2.50 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 4 అంతస్తుల శాశ్వత మెడికల్ కాలేజీ భారీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికే రెండేళ్లు ఎంబీబీఎస్ విద్యార్థులకు తరగతులు సాగుతున్నాయి. వచ్చే ఏడాదికైనా శాశ్వత భవనాన్ని పూర్తి చేస్తారా ? అనేది సందేహంగా మారింది. వైద్య విద్యార్థులకు సంబంధించి హాస్టల్ భవన నిర్మాణాలు తుదిదశకు చేరాయి. బాలికలు, బాలురకు వేర్వేరుగా హాస్టల్ భవనాలను సుమారు రూ.35 కోట్లతో నిర్మిస్తున్నారు. ఇక శాశ్వత సర్వజన ఆసుపత్రి నిర్మాణం, వైద్యులకు, నర్సింగ్ సిబ్బంది నివాసానికి క్వార్టర్లు ఎప్పటికి నిర్మిస్తారో సందేహంగా మారింది.



ఏలూరు జీజీహెచ్ హాస్పిటల్ (ఫైల్)



జీజీహెచ్‌లో వృద్ధురాలిని బంధువే వీల్‌చైర్‌పై తీసుకువెళుతున్న దృశ్యం (ఫైల్)



ఏలూరు జీజీహెచ్‌లో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ శాశ్వత భవనం (ఫైల్)



ఏలూరులోని కొత్తపేట యూపీహెచ్‌సీ (ఫైల్)

సేవలు అంతంతమాత్రమే

ఏలూరులో అర్బన్ హెల్త్ సెంటర్లు ఆశించిన స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించటం లేదు. గత ప్రభుత్వం హయాంలో 5 యూపీ హెచ్‌సీలకు భవనాలు నిర్మాణం చేపట్టారు. ఆయుష్మాన్ భారత్, నగరపాలక సంస్థ నిధులతో వీటిని అత్యంత ఆధునిక సౌకర్యాలతో నిర్మించారు. ఒక్కో యూపీహెచ్‌సీను రూ.80 కోట్లు వెచ్చించి నిర్మించారు. యూపీహెచ్‌సీలను స్థానికంగా ఉండే ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. పరీక్షలు చేసేందుకు ల్యాబ్, 172 రకాల మందులు రోగులకు ఇచ్చేలా చర్యలు చేపట్టారు. బీపీ, గుండె వ్యాధులు, కొలెస్ట్రాల్, మధుమేహం, గ్యాస్ సమస్య, ఆయాసం, వాంతులు, విరేచనాలు, జలుబు, జ్వరం ఇలా అన్ని రకాల మందులు గత ప్రభుత్వం హయాంలో అందుబాటులో ఉన్నాయి. కానీ నేడు అవి నిరుపయోగంగా మారతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో నెలకొంది.

108 అత్యవసర సేవలు ఎక్కడ?

జిల్లా కేంద్రంలో 108 అంబులెన్స్‌ల జాడ కానరావటంలేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. 108 అత్యవసర సేవల లక్ష్యాలకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ప్రజలకు సేవలు దూరమయ్యాయి. ఏలూరు జీజీహెచ్‌కు విషమ పరిస్థితుల్లో రోగులను తెచ్చినా... విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. అంబులెన్స్‌లు రిఫర్ కేసులను తీసుకెళ్లే క్రమంలో ఏలూరులోని ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని అంటున్నారు. ప్రాణాపాయ స్థితిలో 108కు కాల్ చేసినా ఎవరూ స్పందించటంలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో 10ని మిషాల్లోపు అంబులెన్సులు వచ్చేవి. కానీ నేడు కూటమి ప్రభుత్వం ప్రజల ప్రాణాలపై ఎలాంటి శ్రద్ధ చూపించటంలేదనే ఆరోపణలు ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం విఫలం



ప్రజలకు విద్య, వైద్యాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెరుగైన రీతిలో చేరువ చేస్తే... కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని భ్రష్టుపట్టిస్తోంది. అక్కాచెల్లెమ్మలకు ఎంతో మేలు చేసే ఫ్యామిలీ డాక్టర్, పేదలను ఆదుకునే ఆరోగ్య ఆసరా, ఆరోగ్య సురక్షలను రద్దు చేసింది. ఆరోగ్యశ్రీ పథకాన్ని నిలిపివేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేని కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా మోసం చేసింది. అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా నేటికీ ప్రజలకు ఏమి మంచి చేశారో చెప్పుకోలేని దుస్థితిలో కూటమి పాలన ఉండడం దురదృష్టకరం.

– మామిళ్లపల్లి జయప్రకాష్, వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త

కాలేజీ నిర్మాణం ఎప్పటికి పూర్తి చేస్తారు?



వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారు. ఏకంగా రూ.525 కోట్లు నిధులు మంజూరు చేశారు. యుద్ధప్రాతిపదికన రూ.60 కోట్లతో ఆధునిక భవనాన్ని నిర్మించి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం క్లాసులు ప్రారంభించారు. 2024 సెప్టెంబర్‌లో రెండో ఏడాది సైతం క్లాసులు ప్రారంభించారు. శాశ్వత భవనాన్ని ఎప్పటికి పూర్తి చేస్తారో కూటమి నేతలకే తెలియాలి. నూతన సర్వజన ఆసుపత్రి భవనం, వైద్య విద్యార్థులకు హాస్టల్స్, వైద్యులు, నర్సింగ్ స్టాఫ్‌కు నివాసిత గృహాలు పూర్తి అవుతాయా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

– నెరుసు చిరంజీవి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు

చలనచిత్ర చరిత్రను తిరగరాసిన సూపర్‌స్టార్ కృష్ణ



కృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమాన సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తెలుగు చలనచిత్ర చరిత్రను దివంగత హీరో, సూపర్ స్టార్ కృష్ణ తిరగరాసారని ఆయన అభిమాన సంఘం నాయకుడు దిరిశాల వరప్రసాద రావు అన్నారు. కృష్ణ జయంతిని ఆయన అభిమాన సంఘం ప్రతినిధుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్థానిక కొత్తబస్టాండు వద్ద ఉన్న కృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అభిమానులకు ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వరప్రసాద రావు మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో సువర్ణాధ్యాయం కృష్ణతోనే సాధ్యమైందన్నారు. సినీరంగంలో అన్ని విభాగాలకూ ఉపాధి కల్పించే దిశగా ఆయన ఏడాదికి 10 నుంచి 18 సినిమాల్లో నటించిన సందర్భాలు కూడా ఉన్నాయన్నారు. ఎండీ ఖాజా వలీ మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగానికి సినిమా స్కోప్, 70 ఎంఎం, డాల్బి సౌండ్ సిస్టం, వంటి సాంకేతికతలను అందించిన ఘనత ఆయనదేనన్నారు. తెలుగు తెరపై జేమ్స్‌బాండ్, కౌబాయ్ పాత్రలను తీసుకువచ్చింది కూడా కృష్ణే అన్నారు. పద్మాలయ స్టూడియో నిర్మించి సినీ రంగంలో ఎంతోమందికి ఉపాధి కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తా కాశీ, కే. సూర్యారావు, ఎండీ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నిర్వహించిన సంగీత విభావరి కార్యక్రమం ప్రేక్షకులను విశేషంగా అలరించింది. కృష్ణ నటించిన పలు చిత్రాల్లోని హిట్ పాటలను గాయనీగాయకులు ఆలపించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు.

ఆంజనేయుని ఆలయంలో అన్నసమారాధన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక గజ్జెలవారి చెరువు సమీపంలోని శ్రీ ప్రసన్న పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఇటీవల హనుమజ్జయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబికా రాజా తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా మెలగాలి

గణపవరం: గ్రామంలోని ప్రజలంతా కుల,మత, వర్గబేధాలు లేకుండా ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే గ్రామం ప్రశాంతంగా అభివృద్ధి బాటలో పయనిస్తుందని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ సెల్ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు అన్నారు. శనివారం జాతీయ పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గణపవరంలో సివిల్ రైట్ దినోత్సవాన్ని తహసీల్దార్ అప్పారావు అధ్యక్షతన నిర్వహించారు.

ఘనంగా నాట్య నిలయం వార్షికోత్సవం



చిన్నారులకు జ్ఞాపికలు అందించిన అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం 10వ వార్షికోత్సవం శనివారం స్థానిక దొండపాడు శ్రీ నందత్తనాథ క్షేత్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సాహితీవేత్త లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోరాడ నరసింహారావు, శోభా నాయుడు, వెంపటి చినసత్యం వంటి నాట్య గురువుల కృషి వల్ల తెలుగువారి సాంప్రదాయ నృత్యమైన కూచిపూడి ప్రపంచ దేశాలన్నిటిలోనూ అగ్రస్థానానికి చేరిందని వివరించారు. నాట్య గురువు మేదరమెట్ల శిరీష మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అధికార నృత్యమైన కూచిపూడి నాట్య దినోత్సవాన్ని కూచిపూడి నాట్య పితామహుడు సిద్ధేంద్ర యోగి జయంతి నాడు అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారని తెలిపారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కూచిపూడి నాట్య కళాశాలలను ఏర్పాటు చేయాలని, చదువులతో పాటు కళల వైపుగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. ఈ సందర్భంగా సీఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకురాలు అనిత కుమారిని ఆదర్శ మహిళ అవార్డుతో సత్కరించారు. రూ.25 వేలు విలువ చేసే కూచిపూడి నాట్య ఉచిత శిక్షణ 2025 వార్షిక స్కాలర్‌షిప్‌ను గంధం ప్రణవి, యర్రా వైష్ణవిలకు అందించారు. కార్యక్రమంలో పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరంలో కూచిపూడి నాట్యం నేర్చుకున్న 80 మంది విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా జ్ఞాపికలు బహూకరించారు.

అంకితభావంతో పనిచేయాలి



సదస్సులో మాట్లాడుతున్న మేరీ గ్రేస్ కుమారి

ఏలూరు (టూటౌన్): ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు త్వరితగతిన నాణ్యమైన సేవలు అందించేందుకు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు అంకిత భావంతో పనిచేయాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో శాశ్వత లోక్ అదాలత్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల నాణ్యమైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ రవాణ, పోస్టల్, బ్యాంకింగ్, విద్య, వైద్య, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, ఉపాధి హామీ, రియల్ ఎస్టేట్ మొదలైన సేవలలో లోపం జరిగిన శాశ్వత లోక్ అదాలత్‌లో సంప్రదించవచ్చని సూచించారు. కక్షిదారులు నేరుగా లేక పారా లీగల్ వలంటీర్ల ద్వారా కూడా అర్జీలను అందజేయవచ్చని, రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. సమస్యలను నేరుగా లేదా 15100 ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని అన్నారు. పారా లీగల్ వలంటీర్లకు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, ఎల్ఏడీసీ, శాశ్వత లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	26	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	34	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	48
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	44	బీట్‌రూట్	36
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	22	అల్లం	68
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	26	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
అనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

నాసిరకంగా రోడ్డు నిర్మాణం

నిర్మించిన పది రోజుల్లోనే కుంగుబాటు



రోడ్డులో కుంగిపోయిన తూము



బీటలు వారిన బీటీ రోడ్డు

జంగారెడ్డిగూడెం: పట్టుమని పది రోజులు కాకుండానే వేసిన బీటీ రోడ్డు మరమ్మతులకు గురైంది. ఏళ్ల తరబడి రోడ్డు నిర్మాణానికి ఎదురుచూసిన ఆయా గ్రామాల ప్రజలకు నిరాశే ఎదురైంది. జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం నుంచి చక్రదేవరపల్లి మీదుగా కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టును కలుపుతూ వేగవరం వరకు 5.4 కిలో మీటర్లు మేర బీటీ రోడ్డు నిర్మించారు. దీనికి నాబార్డు నిధులు రూ.3 కోట్లు వెచ్చించారు. ఈ రోడ్డు నిర్మించి సుమారు 10 రోజులు దాటింది. ఇటీవల ప్రాజెక్టులోని గ్రావెల్ వేశారు. తాజాగా ఈ రోడ్డులో ఉన్న తూము కుంగిపోయింది. దీంతో హడావుడిగా గ్రావెల్ వేసి తూతూమంత్రంగా మరమ్మతులు చేశారు. వాస్తవానికి ఈ తూమును కల్వర్టుగా మార్చి కాంక్రీట్‌తో నిర్మించాల్సి ఉంది. తూరలు పెట్టి నిర్మాణంలో నాణ్యత లేకుండా గ్రావెల్‌తో పూడ్చి దానిపైన గ్రావెల్, మెటల్‌తో బీటీ వేసి మమ అనిపించారు. తాజాగా, రెండు రోజుల క్రితం తూము కుంగిపోయింది. దీనిపై గ్రావెల్ వేసి కప్పి పుచ్చే ప్రయత్నం చేశారు. రోడ్డుకు ఇరువైపులా అప్పుడే బీటలు వారి ధ్వంసమవుతోంది. కొద్ది రోజులు ఈ రోడ్డుపై వాహనాలు తిరిగితే రోడ్డు మొత్తం ధ్వంసమవుతుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. నాణ్యత లేకుండా రోడ్డును నిర్మించారని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు ఇంకా బిల్లులు అవలేదని తెలిసింది. తనకు బిల్లులు అయ్యే వరకు పెద్ద వాహనాలు ఈ రోడ్డుపై తిప్పవద్దని కాంట్రాక్టర్ వాహనచోదకులను కోరినట్లు తెలిసింది.

కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ కోర్సు

బుట్టాయగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2025 – 26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ వృత్తి విద్యా కోర్సుగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంజీవని కుసుమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ గిరిజన ప్రాంత విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా ఒకేషనల్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ పూర్తి చేసిన విద్యార్థులు నేరుగా జూనియర్ ప్రోగ్రామర్, కంప్యూటర్ ఆపరేటర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, మొదలగు ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. కళాశాలలో అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	06
ఏలూరు - జీడిమెట్ల (ఖమ్మం) (ఇంద్ర)	20.15	01
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	0
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	02
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	03
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	06
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	02
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.00	98516	34
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.40	98507	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

మస్తర్లలో మాయాజాలం



కన్నాపురంలో పనిప్రాంతంలో కూర్చుని ఉన్న కూలీలు

కొయ్యలగూడెం: ఉపాధి హామీ పథకం అవినీతికి అడ్డాగా మారిందని కూలీలు విమర్శలు చేస్తున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాల కల్పించడం లేదని, తమ నుంచి ప్రతివారం డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. పనికి రాని వ్యక్తుల పేర్లతో మస్తర్లు వేసి నిధులు స్వాహా చేస్తున్నారని చెబుతున్నారు. పని చేసే తమకు చేసిన పనికి సరిపడా వేతనం లభించడం లేదంటున్నారు. వచ్చిన కొద్దిపాటి సొమ్ములో మామూలు అంటూ వసూళ్లకు పాల్పడుతున్నారని, కొన్ని మార్లు వేతనం రావడానికి కూడా తీవ్ర జాప్యం అవుతోందని అంటున్నారు. ప్రతివారం పనులకు వచ్చే కూలీ రూ.150 చెల్లించాల్సిందేనని, పనికి రాకుండా మస్తర్లు పొందుతున్న వారు వారంలో సగం వేత నం ఇవ్వాల్సిందేనని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం పని ప్రదేశాల్లో టెంట్, మంచినీ రు, ప్రథమ చికిత్స కిట్‌లు తప్పనిసరిగా ఉండాలి, కానీ అవి అమలుకు నోచుకోలేదని చెబుతున్నారు. వేతనాల విషయంలో గట్టిగా వాదిస్తుంటే తమ జాబ్ కార్డులు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. కొన్నిచోట్ల కాలక్షేపానికి వచ్చి కూలీలు క బుర్లు చెప్పుకుంటూ సమయం ముగిసేసరికి ఇళ్లకు తిరుగు ము ఖం పడుతున్నారని రైతులు విమర్శిస్తున్నారు. కూలీల నుంచి సొ మ్ములు ఎందుకు వసూలు చేస్తున్నారో స్పష్టత లేకపోవడం వల్ల అసంతృప్తి నెలకొందంటున్నారు. వసూళ్లు చేసేది సిబ్బంది అయినా అధికారుల కనుసన్నలలోనే తతంగమంతా నడుస్తోందని విమర్శిస్తున్నారు.